

జాతీయ స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్లో విద్యనభ్యసిస్తున్న రిషిత్ వర్మ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జిఎఫ్ అండర్-19 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గుంటూరు జిల్లా మోదుకూరులో నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో కడప జిల్లా జట్టు రెండవ స్థానంలోనూ, బాలికల విభాగంలో నాలుగో స్థానంలోనూ నిలిచిందన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న రిషిత్ వర్మ అద్భుత ప్రతిభ కనబరిచి జనవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారన్నారు. రిషిత్ వర్మ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికపై కడప ఎస్‌జిఎఫ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.



కప్పుతో రిషిత్ వర్మ

మదనపల్లె జిల్లా ఏర్పాటు వేగవంతం

- ప్రభుత్వ కార్యాలయాల ఎంపికలో అధికారులు బిజీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కొత్తగా ఏర్పడుతున్న మదనపల్లె జిల్లాకు సంబంధించిన ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ప్రభుత్వం జనవరి ఒకటి నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలనే స్పష్టమైన సంకేతాలు ఇవ్వడంతో జిల్లాలోని ఉన్నతాధికారులు వేగంగా పనులు ముందుకు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి నేతృత్వంలో కొత్త ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుపై విస్తృత చర్చలు సాగుతున్నాయి. ప్రాథమికంగా సబ్ కలెక్టర్ కార్యాలయాన్నే కొత్త జిల్లా కలెక్టర్ కార్యాలయంగా మార్చే ఆలోచన ఉంది. తాజాగా ప్రారంభించిన డిఎల్‌డిఒ కార్యాలయానికి సబ్ కలెక్టర్ ఆఫీస్‌ను మార్చడం, బిటి కళాశాల, జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల భవనాలను తాత్కాలిక ప్రభుత్వ కార్యాలయాలుగా ఉపయోగించడం కూడా పరిశీలనలో ఉంది. జిల్లాలో దాదాపు 60 ప్రభుత్వ శాఖలు ఉండడం వల్ల, వాటిలో చేరే కార్యాలయాల కోసం ప్రభుత్వ భవనాలతోపాటు ప్రయివేటు భవనాలు కూడా ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఉంది. సుమారు 50 శాతం శాఖలకు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాట్లు చేయొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎస్‌పి కార్యాలయానికి సరిపోయే భవనం ఇంకా దొరకకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఒక వారంలో ఎంపికలు పూర్తిచేసి ప్రభుత్వం వద్దకు ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం ఉంది. ఇక రాబోయే జనవరి 26 గణతంత్ర వేడుకలను కొత్త జిల్లాలోనే నిర్వహించే అవకాశాలు పెరిగాయి. కార్యక్రమం కోసం బెంగళూరు రోడ్డులోని బిటి కళాశాల మైదానం అనుకూలమని అధికారులు భావిస్తున్నారు.

జిల్లా సరిహద్దులు.. ప్రజల్లో ఆశలు, ఆందోళనలు : మదనపల్లె జిల్లా తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నాలుగు నియోజకవర్గాలతో ఏర్పడుతోంది. పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల మండలం మదనపల్లెలో చేరినా, అదే మండలం రెవెన్యూ డివిజన్ మాత్రం చిత్తూరుకే చెందినట్లు గెజిట్‌లో పేర్కొనడం ఆందోళనలకు దారితీసింది. దీనిపై ప్రజలు గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ రొంపిచెర్లను పీలేరు రెవెన్యూ డివిజన్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన మదనపల్లె బిటి కళాశాల

క్షేత్రస్థాయిలో పెరుగుతున్న డిమాండ్లు : అన్నమయ్య జిల్లా ప్రస్తుతం రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి మూడు నియోజకవర్గాలకు పరిమితం కానుంది. ఇప్పటి వరకు ఆరు నియోజకవర్గాలున్నా ఇప్పుడు మిగతా మండలాలు విడిపోయిన కారణంగా జిల్లా చిన్నదిగా మారింది. ఇప్పుడు జిల్లా కేంద్రం ఎక్కడ ఉండాలి అన్న ప్రశ్నపై తీవ్ర చర్చ జరుగుతోంది. రాజంపేట మూడు నియోజకవర్గాలకు కేంద్రబిందువుగా ఉండటంతో అక్కడి ప్రజలు దాన్ని కేంద్రంగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు రాయచోటి ప్రజలు ఇటీవల భారీ స్థాయిలో ఉత్సవం నిర్వహిస్తూ రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగించాలని కోరుతున్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను ప్రయివేట్, కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగానే నేడు మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రభుత్వ విద్యను, వైద్యాన్ని పేద, బడుగు, బలహీన వర్గ విద్యార్థులకు దూరం చేసేప్రయత్నం చేస్తుందని దానికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షు, కార్యదర్శులు నరసింహ సర్వేపల్లి, డి.వి.రమణ అన్నారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి లతీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ముఖ్యమైన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మెడికల్ కళాశాలలల ప్రయివేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాక ముందు నారా లోకేష్ ఉన్నత విద్యకు శాపంగా ఉన్న జిఒ నెంబర్ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 18 నెలల అవుతున్నా హామీని విస్మరించారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అప్పుల పాలు అయ్యే పరిస్థితి ఉందని కాబట్టి వెంటనే రూ.4,700 కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోడూరు ప్రాంతంలో ప్రత్యేక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఐటిఐ కళాశాల కూడా ఏర్పాటు చేయించడం కోసం స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని పేర్కొన్నారు. సౌత్ ఇండియాలోనే అతిపెద్ద ఫ్రూట్స్ బిజినెస్ ఉన్న రైల్వేకోడూరులో జ్యూస్ ఫ్యాక్టరీని, మంగంపేట మైనింగ్ లో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. కోడూరు ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజ్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ

నరేంద్ర మోడీ అధికారంలోకి రాక ముందు నిరుద్యోగ యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ అధికారం చేపట్టి 11 ఏళ్లు అయినప్పటికీ ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ దేశంలో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ వెలిగిపోతుందని ఒకవైపు చెప్తూనే, మరోవైపు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ తన రాజకీయ పబ్బాన్ని గడుపుకుంటున్నారని ఆరోపించారు. పరిశ్రమలు లేకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు లేక యువత వలసలు వెళుతున్నారని, జిల్లాలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వలసలను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు మదన్ మోహన్‌రెడ్డి, గురునాథ్,ఆఫ్రిద్, ప్రశాంత్, జగన్, సుమంత్, వేణు, ఇరాన్, రిషి, లోకేష్, కృష్ణ, తరుణ్, చిన్న, జిల్లా నలుమూలల నుండి ముఖ్యమైన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి స్థలం మంజూరు చేయాలి

- సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



డిఆర్‌ఒకు సమస్యను వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి తక్షణమే రూ.4 లక్షలను మంజూరు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదనరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాల మంజూరు కోసం ఈనెల 14 వరకు గడువు పెంచిందని తెలిపారు. అయితే సచివాలయ స్థాయిలో అధికార యంత్రాంగం పెంచిన గడువునను సరించి లబ్ధిదారులను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు కావాలని వచ్చిన లబ్ధిదారులకు సహకరించడం లేదని, గడువు పూర్తయిందని తెలుపుతూ లబ్ధిదారులను నిరాశకు గురి చేస్తున్నారని వాపోయారు. తక్షణం అర్హులైన లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని కోరారు. అర్హురాలుగా ఉన్న గాలివీడు మండల కేంద్రానికి చెందిన, చాకిబండ అంజనమ్మకు, ఆమెకు తెలియకుండానే గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు పెట్టుకున్నట్లు ఆన్‌లైన్‌ల చూపిస్తుందని, కారణంగా ప్రస్తుతం అంజనమ్మకు ఇంటి స్థలం మంజూరు కాదని అధికారులు చేస్తున్న అన్యాయాన్ని వివరించారు. ఇలాంటివారు అధిక సంఖ్యలో జిల్లాలో ఉన్నారని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంజనమ్మ,రెడ్డి బాబు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రాయచోటి : డిసిసి బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న సహకార శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి -రాయచోటి అర్బన్

తాము ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సహకార శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎదుట ఉద్యోగులు జెఎసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి ప్యాక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుప్పం రెడ్డిబాబు, రాష్ట్ర కార్యదర్శి వేల్పుల ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగులు ఈ నెల 6 నుండి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం దారుణం అన్నారు. జీవో నెంబర్ 36ను వెంటన్ అమలుచేసి ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇచ్చి డిఎల్‌ఎఫ్ ఏర్పాటు చేసి జీతభత్యాలు చెల్లించాలని కోరారు. 2019, 24 వేతన సవరణలు పెండింగ్‌లో ఉన్న కారణంగా వాటిని సవరించి మధ్యంతర భృతిని ఇవ్వాలన్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని చేసి చట్ట ప్రకారం చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. రూ. 5 ఐదు లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. ఎవరైనా ఉద్యోగి సర్వీస్‌లో ఉన్నప్పుడే చనిపోతే 20 లక్షలు బీమా సౌకర్యం కల్పించి కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. సమస్యలను సత్వర పరిష్కరించని పక్షంలో ఈ నెల 15న జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈనెల 29న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. జనవరి 3 నుంచి 26 వరకు అన్ని జిల్లాల ఉద్యోగుల ఆందోళనలు పూర్తయ్యే వరకు విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్షలు నిర్వహిస్తామని చెపాపరు. జిల్లాల నిరాహార రిలే నిరాహార దీక్షలు పూర్తయినంత అనంతరం ఆమరణ నిరా హారదీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాయచోటి, సహకార బ్రాంచ్ పరిధిలోని సంఘం సిబ్బంది, సుండుపల్లి, తిమ్మసముద్రం ప్యాక్స్ సంఘం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాను నిర్వహించారు. ఎపి ప్యాక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు సాబ్జాన్, అన్నమయ్య జిల్లా కన్వీనర్ జాఫర్ వలి, సంఘ సిబ్బంది వీర శేఖర్రాజు, రాఘవేంద్రరెడ్డి, మదన వేణి, సాయి, వీరభద్ర స్వామి, నరేష్, శ్రీనివాసులు, అన్సర్, హరినాథ్, ఇందాద్, శ్రీరాములు, రవికుమార్, నాగమణి, భూపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటరమణ, సాయి, నరసింహులు, జె.డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గాలివీడు : సకార శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎదుట ఉద్యోగులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిపిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుప్పం రెడ్డిబాబు, రాష్ట్ర కార్యదర్శి వేల్పుల ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారన్నారు. గాలివీడు, సహకార బ్రాంచ్ పరిధిలోని సంఘం సిబ్బంది, గాలివీడు, నూలివీడు ప్యాక్స్ సంఘం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఇఒ కె.ఆంజనేయులురెడ్డి, బి.ప్రతాప్‌రెడ్డి, క్లర్క్ జి.శ్రీనివాసులు, వి.రెడ్డెప్పరెడ్డి, ఆర్.ప్రతాప్ పాల్గొన్నారు.



గాలివీడు : నిరసన తెలుపుతున్న సహకార శాఖ ఉద్యోగులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 31 తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరీంద్రనాథ్ శర్మ తెలిపారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్లు రద్దు కోసం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్, తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. మహాసభలకు అన్ని వర్గాలు ప్రజలు, కార్మికులు సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు పి.శ్రీనివాసులు, రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, శ్రీరాములు, రమణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి కట్టుబడి ఉన్నాం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట జిల్లా కేంద్రానికి కట్టుబడి ఉన్నామని, జెఎసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర సాధనకు ముందుకు వెళ్తామని తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. సోమవారం జిల్లా కేంద్రం సాధన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన చర్చలలో చమర్తి జగన్మోహన్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయపరంగా రాజంపేట అన్ని విధాల జిల్లా కేంద్రానికి అర్హత కలిగి ఉందని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ నినాదాన్ని ప్రభుత్వానికి వినిపించాలని కోరారు. ప్రతి ఇంటి నుండి రాజంపేట జిల్లా కేంద్రానికి మద్దతు పలకాలని కోరారు. ప్రాంతం కంటే భవిష్యత్తు తరాల బాగుకోసం కలిసి నడవాలని, గత వైసిపి ప్రభుత్వంలో చేసిన కుట్రలను ఈసారి భగ్నం చేయాలని స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. రాజంపేట జిల్లా కేంద్రం అయ్యేవరకు విశ్రమించేది లేదని తెలియజేశారు.



జెసిఎస్ నాయకులతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

గ్రామీణ తపాలా జీవన బీమాపై అవగాహన

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక మండల ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ తపాలా జీవన బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంచేల విజయభాస్కర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ అఫ్ పోస్ట్ ఆఫీస్ కడప డివిజన్, సిబ్బందికి విలువైన మార్గదర్శక సూచనలు అందించారు. గాలివీడు పరిధిలోని బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, సహాయ బ్రాంచ్ పోస్టుమాస్టర్లు ఈనెలలో నిర్వహించబోయే 'మహా బీమా సంకల్ప్ 2.0' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ దొరస్వామి పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజంపేట: ప్రకృతి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్‌ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి కె.వెంకట నరసయ్య పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ప్రత్యేక క్యాంపులో భాగంగా ఎన్‌టిఆర్ కాలనీలో వివిధ రకాల మొక్కలను నాటారు. ప్రధానంగా కానుగ, బాదం, వేప, మొదలైన ఆయుర్వేద మొక్కలతో పాటు గన్నేరు, కాగితం వంటి పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు.

విద్యతోనే ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి-రామాపురం : వికలాంగుల్లో చదువుతూనే ఆత్మస్థైర్యం కలుగుతుందని ఎంఇఒలు రామకృష్ణుడు, జయచంద్ర పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల పిల్లలలో ఆత్మస్థైర్యం నింపడానికి ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కేంద్రంలో పిల్లలకు చదువుతోపాటు మానసిక వికాసం నింపడానికి దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు తమ మిగిలిన సంతానంతో పాటు ఈ పిల్లల పైన ప్రేమానురాగాలతో చూడాలని పేర్కొన్నారు. పాఠశాలలకు కచ్చితంగా పంపించి వారి ఉన్నతికి దోహదపడాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎఫ్.వి. రవీంద్రనాథ్ రాజు, సునీత, ఉపాధ్యాయులు సునీత, భవిత కేంద్రం ఐఇడి జమనుల్లా, వరలక్ష్మి, సిఆర్‌పిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

రాయచోటిలో విషాదం

- కుక్కలు వెంటపడటంతో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



షేక్ ఫజిల్ (ఫైల్ ఫొటో)

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ సమీపంలోని అపోలో మెడికల్ స్టోర్ వద్ద సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో షేక్ ఫజిల్(28) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వీధి కుక్కలు వెంబడించాయి. భయాందోళనకు గురైన ఫజిల్ అతివేగంగా ముందుకు దూసుకెళ్లి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న రామాలయం గుడి స్తంబాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు పట్టణంలో నుంచి లక్ష్మీపురంలో ఉన్న ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడు జీవనోపాధి కోసం సౌదీకి వెళ్లగా మూడు నెలల కింద ఇండియాకు పెళ్లి చేసుకోవాలని రావడంతో అంతలోనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించని కారణంగా ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబాలు గడవడం చాలా కష్టంగా ఉందని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందుంచారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని లేదంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పనిచేస్తున్న కార్మికులకు సరైన పనిముట్లు ఇవ్వడం లేదని, కార్మికులకు యూనిఫాం కొబ్బరినూనె చెప్పులు లాంటి సౌకర్యాలు ఇంకనైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలో ఇస్తున్నప్పటికీ రాయచోటి మున్సిపాలిటీలో మాత్రం కార్మికులకు ఎటువంటి బెనిఫిట్ లేకుండా కార్మికులే డబ్బులు పెట్టి పనిముట్లు కొనుక్కునే పరిస్థితికి వచ్చిందని ఆయన మండి పడ్డారు. ఎన్నో ఏళ్లగా మున్సిపాలిటీ సర్వీసు చేస్తూ మరణించిన కార్మికులకు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మరణించిన కుటుంబాలు ఐదు వరకు ఉండగా ఏ ఒక్క కుటుంబానికీ ఉద్యోగం కల్పించలేదని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్లు అక్బర్ బాషా, రమణారెడ్డి పాల్గొన్నారు.

వీరబల్లిని కమ్మేసిన పొగ మంచు

ప్రజాశక్తి- వీరబల్లి

మండలాన్ని సోమవారం చుట్టూ పొగ మంచు కమ్మేసింది. ఈ స్థాయిలో పొగ మంచు రావడం ఇదే మొదటిసారి. ఎక్కువ పొగ మంచు రావడంతో మండల వ్యాప్తంగా దారులు అన్ని కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు సహాయంతో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 9 గంటలు అయినప్పటికీ పొగ మంచు తగ్గడం లేదు. చాలామంది వాహనదారులు అప్రమత్తంగా వెళ్తున్నారు. మనుషులు దగ్గరకు వచ్చేంతవరకు కూడా కనిపించకపోవడంతో ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు. రహదారులతోపాటు నివాస ప్రాంతాల్లో ఎదురుగా ఉన్న వస్తువులు కనిపించినంతగా దుప్పటి కప్పినట్లుగా పొగ మంచుతో నిండిపోయింది.

అధికార పార్టీ తప్పులను ప్రశ్నిస్తే దాడులా? : వైసిపి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అధికార పార్టీ నేతలు చేస్తున్న తప్పులను ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం ఏమిటని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రాయచోటిలో వైసిపి వర్గీయులపై జరుగుతున్న దాడులపై సోమవారం ఆయన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డితో కలిసి ఎస్‌పి ధీరజ్ కునుబిల్లికి వినతి పత్రం సమర్పించి, పూర్తి విషయాలను వివరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం బిసి నాయకుడు విజయ భాస్కర్‌పై జరిగిన పాశవిక దాడి, రాయచోటి పరిస్థితులపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసి, తీవ్రమైన గాయాలతో పడిపోయిన మనిషి ఫోటోలు తీసుకుని పరారయిన నిందితుల చర్య దారుణమన్నారు. రాయచోటి నియోజకవర్గంలో వరుసగా బిసి నేతలను టార్గెట్ చేసుకొని దాడులు జరుగుతుండడం దారుణం అన్నారు. ప్రశ్నిస్తున్న వ్యక్తుల ను భయపెట్టేలా దాడులకు దిగడం తగదన్నారు. ప్రజలను భయపెట్టే విధంగా దాడులకు దిగుతుండడం అభ్యంతరకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బిసి నేత వండాడి వెంకటేశ్వర్ల ఇంటిపై దాడి, జడ్‌పిటిసి రమాదేవి, మాజీ ఎంపిపి రెడ్డెయ్య ఇంటిపై దాడి జరిగిందని, మైనారిటీ కౌన్సిలర్లపై దాడులు జరిగాయన్నారు. తరచూ జరుగుతున్న హింసాత్మక ఘటనలకు బాధ్యులైన వారు నేటి వరకు ఒకరు కూడా అరెస్టు కాకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, గాలివీడు మండల వైసిపి కన్వీనర్ మిట్టపల్లె యధుభూషన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎంపిపి అంపాబత్తిన రెడ్డెయ్య, వైసిపి మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, గాలివీడు మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, కౌన్సిలర్లు కొలిమి చాన్ బాష, షబ్బీర్, గౌస్ ఖాన్, మహేష్ రెడ్డితో పాటు పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.



ఎస్‌పికి వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు



సైన్స్ సెంటర్ వద్ద శ్రీభువన విద్యాలయం విద్యార్థులు

శ్రీభువన విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పీలేరు

4వ విజ్ఞానోత్సవంలో పీలేరు శ్రీభువన విద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటారని కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మి తెలిపారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్, బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో రీజినల్ సైన్స్ సెంటర్లో రెండు రోజుల పాటు 4వ పిల్లల విజ్ఞానోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ విజ్ఞానోత్సవంలో భాగంగా సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా, ఐడియాథోన్ వంటి పలు పోటీలు నిర్వహించగా, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో తమ శ్రీభువన విద్యాలయానికి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని చెప్పారు. 'ఐడియాథోన్' పోటీలో కారుణ్య ప్రతిభ చాటి బహుమతి సాధించగా, సైన్స్ ఎక్స్పోలో అక్షర, తీర్థ రెడ్డి తమ వినూత్న సైన్స్ నమూనాలతో జడ్జీలను ఆకట్టుకొని మొత్తం మూడు పోటీల్లో రెండు బహుమతులు కైవసం చేసుకున్నారని తెలియజేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు ఇటువంటి విజ్ఞానోత్సవాలు ఎంతో దోహదపడతాయని వారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

బోటికొండ రోడ్డు సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని చాకిబండ బోటికొండ-చినరాసపల్లి కోన దారి సమస్యను పరిష్కరించిన రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి టీ చాకిబండ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా బోటికొండ నుంచి చిన్నరాస కోన వరకు దారి లేక సన్నపాటి చిరుజల్లులతోనే రైతులు పొలాలకు వెళ్ళాలన్న, పంటలను ఇంటికి తెచ్చుకోవాలన్న సరైన దారి లేక నానా అవస్థలు పడేవారు. ఈ సమస్యను పలువురు రైతులు మండల అధ్యక్షుడు మూగిరెడ్డప్ప, ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, గ్రామ అధ్యక్షులు జయశంకర్, మాజీ ఎంపిటిసి నాగరాజా దృష్టికి తీసుకొని పోగా వారు వెంటనే సమస్యను పరిశీలించి జెసిబి, రిగ్గు సాయంతో మంత్రి సహకారంతో దారి తయారు చేశారు. భవిష్యత్తులో మంత్రి సహకారంతో మరింత మెరుగ్గా రోడ్డును వేసి రైతులకు శాశ్వత పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈశ్వరయ్య, కుమార్, వేణుగోపాల్, షామీర్, ఫయాజ్, ఆనందరెడ్డి, మారుతి, యూసుఫ్, సయ్యద్ గౌస్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తాత్కాలిక రోడ్డు పరిష్కారం చూపడం పట్ల టి.చాకిబండ రైతులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఖలీల్ అహ్మద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

అన్నమయ్య జిల్లా వైసిపి మాజీ ఉపాధ్యక్షులు, బి.కొత్తకో మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ అహ్మద్ జన్మదిన వేడుకలను సోమవారం వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా భవిత విద్యా కేంద్రం ప్రతిభవంతులు విద్యార్థులు చేత కేక్ కట్ చేసి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా భవిత విద్యాలయంలో ప్రతిభవంతులైన పిల్లలకి అన్నదానంతో పాటు, పండ్లు, బ్రెడ్ అందజేశారు. పట్టణంలోని బి.సి కాలనీలో బ్రిక్స్ బావాజాన్, బాంబే మోదిన్ ఆధ్వర్యంలో అభిమానులు, పట్టణం నాయకుల సమక్షంలో బాణాసంచా పేల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ సి.ఆర్ చిన్నికృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబర్ నాసిర్, వైసిపి ఒకటో సచివాలయం మాజీ కన్వీనర్స్ జి.చాంద్ బాషా, వైసిపి నాయకులు భీమగాని ప్రభాకర్‌రెడ్డి, రాయల్ సలీం, సబ్జీ, పట్టణ బూత్ కమిటీ అధ్యక్షులు ఇంతియాజ్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ భాష, గట్లమీద నరసింహనాయుడు, నక్క సంతోష్, సద్దాం, పాగొండ షఫీ, నరసింహ నాయుడు,సాయి, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పిల్లలతో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

జిల్లా కేంద్రం కోసం కదం తొక్కిన విద్యార్థులు



రాజంపేట : ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లాను ప్రకటించాలని కోరుతూ సోమవారం జెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు కదం తొక్కారు. డిగ్రీ కళాశాల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆమె రాజంపేట ప్రాంతీయుల మనోవేదనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో జెఎసి నాయకులు, విద్యార్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు పూల భాస్కర్, ప్రభాకర్ నాయుడు, చిట్వేలి రవికుమార్, ఇ.సికిందర్, బాబు, రాజశేఖర్ నాయక్, డి.ఎస్ రావు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను కూటమి ప్రభుత్వం ప్రకటించాలని సర్పంచుల సంఘం అధ్యక్షులు నాయని హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు సోమవారం తహశీల్దార్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపిడిఒ నాగిరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి వెళ్లాలంటే రైల్వేకోడూరు నుంచి సరైన రవాణా సౌకర్యం లేదని, ఈ కారణంగా జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు కోడూరు ప్రాంత ప్రజలు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మదనపల్లె జిల్లా కేంద్రం ప్రభుత్వం ప్రకటించిందని, రాజంపేట అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించినట్లయితే ఈ ప్రాంత ప్రజలు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. లేని పక్షంలో రైల్వే కోడూరు తిరుపతి జిల్లాలో కలపాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు దార్ల చంద్రశేఖర్,రామక ృష?, సంయుక్త,సుబ్రహ్మణ్యం రాజు, ఆర్.వి.రమణ, గోపి, మావిళ్ళ సుబ్బయ్య, కవితా చంగల్ రెడ్డి,శివ శైలజ, బుడిగి శివయ్య పాల్గొన్నారు.

హంద్రీ-నీవాపై వంతెన నిర్మించండి సారూ..!

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పొలాలకు ఊరికి మధ్యలో హంద్రీ-నీవా కాలువ రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కాలువపై వంతెన నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని జనుపువారిపల్లెకు చెందిన రైతు శ్రీరాములు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది జులై 12న రైతులు హంద్రీ - నీవా కాలువ వద్ద నిరసన తెలిపారని, అప్పట్లో తహశీల్దార్ బాబాజాన్ విచారించి రైతుల సమస్యపై హెచ్ఎంఎస్ ఎఇకి తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు పంపారని చెప్పారు. వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మూగ జీవాలు మేత కోసం హంద్రీ-నీవా కాలువ నీటిని దాటాల్సి వస్తోందని, నీటి ప్రవాహానికి ఆవులు సైతం కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందన్నారు. గత నెలలో కాలువ దాటేందుకు వచ్చిన రెండు ఆవులు మృతి చెందాయని పేర్కొన్నారు. హంద్రీ-నీవా కాలువకు పడమర భాగాన తమ పొలాలున్నాయని, పొలం పనులు చేసుకునేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. భూములకు మధ్య వంతెన నిర్మాణం కోసం గతంలో పరుమార్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించామని, అయినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. జనుపువారిపల్లెలో దాదాపు 15 మంది రైతులకు కాలువ అటువైపున వ్యవసాయ భూములు సుమారు 50 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. బోర్ల ద్వారా వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామని, తమ నివాస గ్రామము నుంచి అక్కడికి వెళ్లాలంటే టి.సదుం క్రాస్ ద్వారా చుట్టూ 4 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు సాగు చేసేందుకు, పశువులు, గొర్రెలు, మేకలు సదరు వ్యవసాయ భూములలోకి తోలుకెళ్లడానికి దారి లేక తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హంద్రీ -నీవ కాలువ మీద వంతెన నిర్మించి వ్యవసాయం చేసుకొని జీవనం సాగించడానికి వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

విభిన్న ప్రతిభావంతుల్లో ప్రతిభను గుర్తించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారి ఉన్నత భవిష్యత్తుకు చేయూతను అందించాలని మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, నారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఉపాధ్యాయులు గుర్తించి, ప్రోత్సహిస్తూ వారి ఉన్నత భవిష్యత్తుకు దోహదపడాలని అన్నారు. విద్యార్థుల కోసం సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలను సమర్థవంతంగా అందిస్తూ, ప్రత్యేక విద్యా రాయితీలను వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సాధారణ పిల్లలతో పాటు విభిన్న ప్రతిభావంతుల పిల్లల కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలకు ఆట పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు సురేష్, అనురాధ, కేర్ టేకర్ న్యామత్‌బీ, మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం భాస్కరన్, గుర్రప్ప, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది నరసింహులు, సౌజన్య, పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ : 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బాల్లో ప్రజల సమస్యలకు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామన్నారు. కోడూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ వినతి పత్రాలతో కార్యక్రమానికి విచ్చేసి,తాము ఎదుర్కొంటున్న సమస్యలను రూపానందరెడ్డికి వివరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను శ్రద్ధగా విని, వెంటనే పరిష్కరించగల సమస్యలపై సంబంధిత అధికారులతో నేరుగా కాల్ చేసి తక్షణ చర్యలు తీసుకునేలా మార్గనిర్దేశం చేశారు.మరిన్ని సమస్యలకు సంబంధించిన ఫైళ్లను స్వీకరించి, వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డిసిఎంఎస్ చైర్మన్ వై జయప్రకాష్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్ రాజు, టిడి.రమణారెడ్డి, మాజీ సర్పంచ్ రామరాజు, మౌలా, హేమరాజ్, టి.రాజశేఖర్, జయచంద్ర పాల్గొన్నారు.

వేగవంతంగా బొంతల చెరువు ఆనకట్ట పనులు

ప్రజాశక్తి-కలికిరి

బొంతల చెరువు ఆనకట్ట మరమ్మతు పనులు వేగవంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పల్లవొళ్ళ పంచాయతీ గడి సమీపంలోని బొంతల చెరువు గత వర్షాలకు ఆనకట్ట తూము మరమ్మతులకు గురై నీళ్లు వృథాగా వెళ్ళిపోతుండడంతో గడి గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫు మొహిద్దీన్ విలేకరుల సమావేశంలో సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. శనివారం ఎంపిడిఒ భానుమూర్తి రావు, ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసులు చెరువును పరిశీలించి వెంటనే మరమ్మతుల పనులకు ఆదేశించారు. సోమవారం సంబంధిత ఇరిగేషన్ సిబ్బంది బొంతల చెరువు ఆనకట్ట తూము మరమ్మతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అఫూ మోహియుద్దీన్ మాట్లాడుతూ వెంటనే స్పందించి మరమ్మత్తు పనులు చేపట్టిన మండల అధికారులకు అభినందనలు తెలిపారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

- ఎస్ఐపై దాడికి యత్నించిన నిర్వాహకుడు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బెల్ట్ షాపులపై పోలీసులు సోమవారం మెరుపుదాడులు నిర్వహించారు. బెల్ట్ షాపులో మద్యాన్ని స్వాధీనపరుచుకునే సమయంలో ఎస్ఐపై దాడికి ప్రయత్నించిన నిర్వాహకుడు శబరీష్. దాడి సమయంలో పిటిఎం ఎస్ఐ పరమేష్ నాయక్ కిందకు పడిపోయాడు. బెల్ట్‌షాప్‌ని నిర్వహిస్తున్న వ్యక్తి పీలేరు నియోజకవర్గం వాయల్పాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుపుతున్నా ఎక్సయిజ్ పోలీసులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.పల్లెల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వామిత్ర సర్వేను వేగవంతం చేయండి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-కలికిరి

స్వామిత్ర సర్వేని వేగవంతం చేసి పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం అయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వామిత్ర, కౌశలం, సిటిజన్ ఇకెవైసి, పిఎంఎవై హౌసింగ్, మానిటరింగ్ బయోమెట్రిక్ అప్డేషన్ వంటి సర్వేలను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రం (బృదావనం)ను ఆయన సందర్శించి అక్కడ తయారైన నాణ్యమైన సేంద్రియ వర్మీ కంపోస్టు ఎరువులు తక్కువ ధరకే రైతులకు అమ్మడానికి సిద్ధం చేశామని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒ అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్‌రెడ్డి, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నందలూరు

మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు మాధవి లత పేర్కొన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘము (ఎస్‌టియు) మండల శాఖకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన లక్ష్మీకాంతమ్మను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాటూరులో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సమస్యల పరిష్కరంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, షఫీ ఉల్లా, చలపాటి నరసింహారావు, సుదర్శన్ రాజు, కిరణ్ బాబు, సుస్మిత, శైలజ, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా కేంద్రంగా ఏర్పాటు కానున్న మదనపల్లి పట్టణంలో క్రీడా సౌకర్యాలు లేకపోవడం వల్ల యువత ఎదుర్కొంటున్న సమస్యలపై బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కుమార్ రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సోమవారం టిడిపి కేంద్ర కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేశారు. పునీత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, వారి శక్తిని సరైన దిశలో నడిపించడానికి క్రీడలు ఒక శక్తివంతమైన సాధనమన్నారు. క్రీడలు లేకపోతే యువతలో నిరాశ పెరిగి, వారు ఇతర వ్యసనాల వైపు మళ్లే ప్రమాదం ఉందని, అందుకే మదనపల్లిలో మినీ స్టేడియం నిర్మాణం తక్షణావసరమన్నారు. స్పందించిన మంత్రి మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధుల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతుల కోసం సరఫరా చేసిన ఉచిత వేరుశనగ పంపిణిలో చోటు చేసుకున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు నాయకులు తహశీల్దారు శివకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం పీలేరు మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ రైతులకు ఇటీవల రైతు సేవ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబర్‌తో వేరుశెనగను ఉచితంగా పంపిణి చేసే కార్యక్రమం ప్రభుత్వం తరుపున చేపట్టడం జరిగిందని, కానీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వేరుశెనగ మండలంలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు అందలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సి.ఆర్.డి.యస్. అధ్యక్షురాలు కె.రాజమ్మ, సభ్యులు కె.గట్టప్ప, పీలేరు మాలమహానాడు మండల యువత అధ్యక్షులు జెట్టి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై బర్త్‌డే హంగామా..!

ట్రాఫిక్‌కు అంతరాయం..ఇబ్బందిపడ్డ ప్రజలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని నడ్డిరోడ్డుపై ఓ వ్యక్తి బర్తడే సంబరాలు జరుపుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన సంఘటన వాల్మీకిపురం పట్టణం గాంధీ బస్టాండ్ వద్ద చోటు చేసుకొంది. ఓ వ్యక్తి బర్తడే కావడంతో గాంధీబస్టాండ్ ప్రాంతంలో బాణా సంచా పేల్చి హంగామా చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా చుట్టుప్రక్కల దుకాణదారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు సైతం విసిగిపోయారు. బాణాసంచా సుమారు 20 నిమిషాల పాటు బాణా సంచా పేలడంతో సౌండ్ అధికంగా రావడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. దాదాపు 20 నిమిషాలు పాటు హంగామా జరిగినా పోలీసులు ఏమి జరుగుతుందో కూడా తెలుసుకోకుండా నిద్రమత్తులో జోగుతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని నడిరోడ్లపై జరుగుతున్న బర్తడే సంబరాలు, బాణా సంచా పేళ్లులు, న్యూసెన్స్ వంటి వాటిపై పోలీసులు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. రాత్రి సమయాల్లో గస్తీ కూడా నిర్వహించకపోవడంతో సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రధానితో మాట్లాడే సువర్ణ అవకాశం

ప్రజాశక్తి - రాయచోటి

బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడే ప్రతిష్టాత్మక కార్యక్రమం 'పరీక్షా పే చర్చ-2026' లో పాల్గొనేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ తిరుపతి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఉదయం డైట్ ప్రాంగణంలో పరీక్షా పే చర్చ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పరీక్ష పే చర్చ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 1 నుంచి జనవరి 11 వరకు కొనసాగుతుందని చెప్పారు. పాల్గొనేవారు innovateindia1.mygov.in వెబ్‌సైట్‌ను సందర్శించి Participate Now బటన్‌పై క్లిక్ చేసి విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రుడు అనే ఎంపికను ఎంచుకుని మొబైల్ నంబర్ లేదా ఇ-మెయిల్ ద్వారా లాగిన్ అయి తమ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఇచ్చిన థీమ్స్‌లలో ఒకదానిని ఎంచుకొని 500 అక్షరాలలోపు ఉండే విధంగా ఒక ప్రశ్న లేదా అభిప్రాయాన్ని తెలపాలన్నారు. వాటిలో ఉత్తమ ప్రశ్న లేదా అభిప్రాయాన్ని ఎంపిక చేస్తారని, అలా ఎంపికైన అభ్యర్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని చెప్పారు. అంతేకాక పరీక్ష పే చర్చ కోసం రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ జనవరి 12 నుంచి ప్రశంసాపత్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రత్యేక సర్టిఫికెట్లు, 'ఎగ్జామ్ వారియర్స్' కిట్‌లు బహుమతులుగా అందజేస్తామని వెల్లడించారు. ఈ సువర్ణావకాశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు శివ భాస్కర్, గిరిబాబు యాదవ్, ఆంగ్ల ఉపాధ్యాయులు పరశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.


బోల్తాపడిన ఆటో

గుంతల రోడ్డుతో తరచూ ప్రమాదాలు

- మరమ్మతులు చేయాలని ప్రజలు వేడుకోలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని పిటిఎం రోడ్డు, రంగసముద్రం రోడ్డులోని ప్రభుత్వ పశువులు ఆసుపత్రి, టమోటా మార్కెట్ యార్డు సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ద్విచక్ర వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా పూర్తిగా గుంతలమయంగా మారింది. సోమవారం గుంతల కారణంగా ప్రయాణికుల ఆటో బోల్తాపడింది. ఆటో పైన రేకులు ఉండడం బోల్తా పడిన సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బోల్తా పడిన ఆటోను ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సాయంతో నిలబెట్టారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు బారిన పడే అవకాశం ఎక్కువ ఉంది. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో రోడ్డు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు వాపోయతున్నారు. అధికారులు స్పందించి కనీస మరమ్మతులైన చేయించాలని, లేకపోతే ప్రజలు ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని చెప్పారు. ఈవిషయంపై వర్క్ ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ రోడ్ల మరమ్మతు కోసం ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాయని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

శరవేగంగా 'నాన్న డైరీ' సినిమా నిర్మాణం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పరిసరాల్లో నాన్న డైరీ సినిమా నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పివిఆర్ సినీ క్రియేషన్స్ బ్యానర్లో నిర్మాత కోటి పాలకుంట చిత్ర నిర్మాణాన్ని చేపట్టారు. సోమవారం పీలేరులో మీడియాతో నిర్మాత మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని, ఓ తండ్రీ, కొడుకుల ఎమోషనల్ సెంటిమెంట్స్‌తో నాన్న డైరీ టైటిల్‌కు ప్రతి పేజీ వెనక ఓ కన్నీటిగాథ సబ్ టైటిల్‌గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. గత నెల 17వ తేదీ నుంచి పీలేరు, సదుం మండలాల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో చిత్రం రెగ్యులర్ షుటింగ్ చేస్తున్నట్లు తెలిపారు. పీలేరు ప్రాంత కళాకారులను ప్రోత్సహిస్తూ ఈ చిత్రంలో నటించేందుకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆనంద్ తంగేళ్ల కథ, మాటలు సమకూర్చగా స్క్రీన్ ప్లే, దర్శకత్వం బాధ్యతలను సురేష్ గండికోట, సహ దర్శకుడిగా సుహేల్, అసోసియేట్‌గా బన్నీ, కెమెరా, ఎడిటింగ్ ఎఆర్ రాఖి అందిస్తున్నారన్నారు. ఈ చిత్రం ప్రధాన పాత్రలో ఆల్ ది బెస్ట్ ఖాదర్, చాను, ఇతర పాత్రల్లో బాబ్జాన్, అమ్ములు, తరిగొండ రాధాకృష్ణ నటిస్తున్నారు.


ఎస్ఐ శివకుమార్‌తో టిడిపి నాయకులు

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రామాపురం

నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్‌ను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టిడిపి మండల అధ్యక్షులు గాలివీడి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలం చాలా వరకు 40వ జాతీయ రహదారి పైనే ఉందని అధిక శాతం ప్రమాదాలు జరుగుతుంటాయ, నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ద ృష్టి సారించి ప్రభుత్వానికి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌కు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట మార్పురి చెన్నకృష్ణారెడ్డి, ఆగ్రో వెంకట్రామిరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, గాలివీడు లక్ష్మారెడ్డి నేరుసుపల్లి సహదేవ రెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



అంకిశెట్టిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అంకిశెట్టిపల్లిలో ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం అంకిశెట్టిపల్లె గ్రామ పంచాయతీలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సర్వేని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగు రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల ప్రభావంతో పల్లెలలో విష జ్వరాలు, వివిధ రకాల అనారోగ్యాలు వ్యాపించే అవకాశం ఉంది కనుక వివిధ రకాల అంటూ వ్యాధుల గురించి ప్రజలలో అవగాహన అవసరమని తెలిపారు. ఈ అవగాహనను గ్రామ ఎఎన్ఎం సహకారంతో వాలంటీర్స్ ప్రతి ఇంటికి వెళ్లి వివరంగా వివరించారు. ఆ గ్రామ ప్రజలలో ఎలాంటి అనారోగ్యాలు కలిగి ఉన్నారని వారి పూర్తి సమాచారాన్ని సేకరించి సంబంధిత ఆరోగ్య కార్యకర్తలకు ఇచ్చారు. గ్రామంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాలంటీర్స్ చక్కగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేశారు. అంకిశెట్టిపల్లి గ్రామ సచివాలయం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, బాలికల జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యుమోనియా వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఊపిరితిత్తులలో నెమ్ము నిర్వహణపై బాలింతలు, గర్భవతులు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం మూరేవాండ్లపల్లిలో న్యూమోనియా వ్యాధి నిర్వహణపై ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో చోటు చేసుకొంటున్న మరణాలకు ప్రధాన కారణం న్యూమోనియా అని, వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై ప్లకార్డులు ప్రదర్శించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పుష్పావతి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


న్యుమోనియా వ్యాధి నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది